## క్లుప్తంగా

### ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డాగురే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కల్లూరు: కాల గర్భంలో కలిసే చరిత్రను సజీవంగా నిలిపేది ఫొటో అని కల్లూరు, కర్నూలు మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు ఎస్కె బాషా, నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం వేడుకలు కల్లూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఘనంగా జరిగాయి. ముందుగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కల్లూరు, కర్నూలు ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఆస్పత్రిలో క్యాన్సర్ వార్డులో రోగులకు పండ్లు, కాన్పుల వార్డులో బ్రెడ్ల పంపిణీ, అనాథ పిల్లకు భోజనాలు అందించారు. కార్యక్రమంలో వాసుదేవయ్య, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని అబ్బాస్‌నగర్ సచివాలయం పరిధిలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు పరిశీలించి, వ్యాక్సిన్లు నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. గర్భిణులు, చిన్నపిల్లలకు సమయానుసారంగా టీకాలు వేయాలని ఆదేశించారు. అర్హులైన మహిళలకు గర్భిణి కిట్ ద్వారా పరీక్షించాలని చెప్పారు. ఆయన వెంట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్వీన్ తబుస్సుమ్, సిబ్బంది ఉన్నారు.

### 21న ఎస్‌ఆర్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

కర్నూలు(హాస్పిటల్) : కర్నూలు మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న 72 సీనియర్ రెసిడెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు ఈనెల 21న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు అర్హులైన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. కర్నూలు మెడికల్ కళాశాలలో పీజీ చదివిన వారికి మొదటి ప్రాధాన్యతనిస్తామన్నారు. పూర్తి వివరాలకు www.kurnool medicalcollege.-ac.inలో చూడాలన్నారు.

### మార్కెట్ యార్డులో ఏఎంఎస్ సస్పెన్షన్‌కు సిఫారసు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో అసిస్టెంటు మార్కెటింగ్ సూపర్‌వైజర్ (ఏఎంఎస్) నరసయ్య విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే టార్పాలిన్‌లను సెక్యూరిటీ సిబ్బంది గోదాముల నుంచి బయటికి తరలించి అమ్మేశారని మార్కెట్ కమిటీ పాలకవర్గం నిర్ధారణకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఏఎంఎస్ సస్పెన్షన్ కోసం పాలకవర్గం అనుమతితో మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు మార్కెటింగ్ శాఖ కడప జాయింట్ డైరెక్టర్‌కు సిఫారసు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది. కాగా టార్పాలిన్‌లను అమ్మేసిన సంఘటన నుంచి బయటపడేందుకు సెక్యూరిటీ గార్డు మధుసూదన్‌రెడ్డి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మొత్తం వ్యవహారం మీద వేసుకుంటే భారీగా నగదు ఇస్తానని ట్రాక్టర్ డ్రైవర్‌ను ప్రలోభ పెడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మధుసూదన్‌రెడ్డి తీరుపై విమర్శలు వెల్లువెత్తుతుండటంతో మార్కెట్ కమిటీ లోతుగా విచారణ జరిపిస్తున్నట్లు తెలుస్తోంది.

### కళాకారుడి మృతికి సంతాపం

కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగస్థల కళాకారుడు నాగేశ్వరరావు మృతి చెందారు. తూడిచర్ల గ్రామానికి చెందిన ఈయన శనివారం పాము కాటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, కర్నూలు కళావాహిని సంస్థ ప్రతినిధులు తెలిపారు. నాగేశ్వర రావు సత్య హరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడినిగా, గయోపాఖ్యానంలో అర్జునుడిగా, సీతా కల్యాణంలో నారదుడిగా నటించి ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి కళా సంస్థలు, కళాకారులు సంతాపం ప్రకటించారు.

### ఉపాధ్యాయ సమస్యలపై నిరసన

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ చేసి మూడు నెలలు కాకముందే మరోసారి పని సర్దుబాటు చేపట్టి టీచర్లను మానసిక క్షోభకు గురి చేయడం తగదని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న అన్నారు. శనివారం రాత్రి డీఈఓ కార్యాలయం ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కో-కన్వీనర్ ప్రకాష్‌రావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా చైర్మన్ గోకారి, కార్యదర్శి గట్టు తిమ్మప్ప పాల్గొని ప్రసంగించారు.

# దోమ పారిపో!

- దోమల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు
- విస్తృతంగా క్రిమిసంహారక మందుల పిచికారీ, ఫాగింగ్ కార్యక్రమాలు
- మలేరియా, డెంగీ పరీక్షల పెంపు
- ఫలితంగా దోమకాటు వ్యాధుల నియంత్రణ



గ్రామాల్లో దోమల నిర్మూలనకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధి చెందే అవకాశాలు పుష్కలం. దోసెడు నీరు నిల్వ ఉన్నా చాలు అవి పుడుతున్నాయి. ఇలా జన్మించిన దోమలు ప్రజల రక్తం తాగుతూ వ్యాధులకు గురిచేసి ఆసుపత్రి పాలుజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దోమల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దోమ పుట్టకూడదు...కుట్టకూడదనే ఉద్దేశంతో క్రిమిసంహారక మందుల పిచికారీ, ఫాగింగ్ కార్యక్రమాలు వేగవంతం చేసింది. దోమ కాటు వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్తగా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో వర్షాలకు కొదవలేదు. ప్రతి యేటా సమృద్ధిగా వానలు పడుతున్నాయి. ఈ మేరకు కరువు ప్రాంతమైన కర్నూలు జిల్లాలోనూ నాలుగేళ్లుగా వర్షాలు బాగా కురుస్తున్నాయి. వర్షాకాలంలో ఇళ్లు, పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెందుతున్నాయి. మంచినీటిలోనూ వారానికి మించి నిల్వ ఉంటే డెంగీ కారక దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ కారణంగా డెంగీ కేసుల సంఖ్య సైతం పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా కర్నూలు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ, కోసిగి, మంత్రాలయం, కౌతాళం, ఆలూరు, చిప్పగిరి, ఎమ్మిగనూరు, హాలహర్వి తదితర ప్రాంతాల నుంచి జ్వరపీడితులు కర్నూలు నగరానికి వస్తున్నారు. జ్వరలక్షణాలున్న వారందరికీ ప్రభుత్వం ముందుగా ర్యాపిడ్ కిట్‌ల పద్ధతిలో డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తోంది. అవసరమైన వారికి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే మలేరియా కేసులు లేవు. డెంగీ, మలేరియా కేసులు ప్రబలిన ఇంటికి చుట్టుపక్కల 50 ఇళ్లల్లో పైరిథ్రమ్ స్ప్రే, కాలనీల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. సమూహ సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలి.

**నేడు దోమల దినోత్సవం**

1897 సంవత్సరంలో రొనాల్డ్ రాస్ బ్రిటీష్ శాస్త్రవేత్త తన పరిశోధనలో ఇన్‌ఫెక్టెడ్ ఆడ ఎనాలఫిస్ దోమ కాటు ద్వారానే మనిషి నుంచి మనిషికి మలేరియా వ్యాధి వ్యాపిస్తోందని కనుగొన్నారు. ఈ మేరకు ఆయనకు 1902లో నోబెల్ బహుమతి ఇచ్చి సత్కరించారు. ఆయన జన్మదినమైన ఆగస్టు 19వ తేదీన దోమల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు**

- మలేరియా: ఆడ అనఫిలిస్ దోమకాటు వల్ల వస్తుంది. ఇది మంచినీటి నిల్వల్లో పెరిగి వ్యాధిని వ్యాపింపజేస్తుంది.
- మెదడువాపు వ్యాధి: పంట పొలాల్లో విస్తారమైన నీటి నిల్వల్లో పెరిగే క్యూలెక్స్ రకానికి చెందిన దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ప్రధానంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో నాలుగు నుంచి 12 సంవత్సరాల పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది.
- డెంగీ : ఏడిస్ ఈజిప్టై అనే దోమ ద్వారా డెంగీ వ్యాధివస్తుంది. ఈ దోమ పగలు పూట కుడుతుంది.
- బోదకాలు వ్యాధి(ఫైలేరియా): క్యూలెక్స్ దోమ కాటు వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి ఎలాంటి తీవ్ర పరిణామాలకు దారితీయనప్పటికీ వ్యాధిగ్రస్తుల మానసిక వ్యథ, శారీరక ఇబ్బందులు ఎక్కువ.
- చికున్ గున్యా : చికున్ గున్యా వైరస్ ద్వారా ఈ వ్యాధి వస్తుంది. ఈ వైరస్ కారక దోమ పగటి పూట మాత్రమే కుడుతుంది.



**2016 నుంచి కేసుల వివరాలు**

| సంవత్సరం | మలేరియా | డెంగీ | మెదడువాపు | చికున్‌గున్యా |
|---|---|---|---|---|
| 2016 | 250 | 33 | 36 | 8 |
| 2017 | 16 | 267 | 35 | 3 |
| 2018 | 19 | 5 | 11 | 0 |
| 2019 | 7 | 63 | 0 | 3 |
| 2020 | 14 | 10 | 5 | 0 |
| 2021 | 18 | 170 | 3 | 2 |
| 2022 | 6 | 342 | 12 | 0 |
| 2023 ఇప్పటివరకు | 4 | 254 | 0 | 0 |

**దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు**

- ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగేందుకు అనువుగా ఉండే నీటి నిల్వలను నిర్మూలించాలి.
- తాగి పారేసిన కొబ్బరి బోండాలను ముక్కలుగా చేసి చెత్తకుండిలో వేయాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటినిల్వ పాత్రలను, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు లాంటి వాటిని పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలి.
- కాల్వలో వ్యర్థాలు, చెత్త, చెట్లకొమ్మలు వేయరాదు.
- వారానికి ఒకసారి పూల తొట్టిలలో,పూల కుండీల్లో నీరు మార్చాలి.నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమలు లోపలికి రాకుండా కిటికీలకు సన్న జాలిని కట్టాలి. దోమతెరలు తప్పనిసరిగా వాడాలి.
- ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి.
- టైర్లు, రోడ్డుపై గుంతలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- జ్వరం వచ్చిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.



అవగాహన బ్యానర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య, అధికారులు

**దోమల నివారణకు విస్తృత చర్యలు**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో దోమల వ్యాప్తి నియంత్రణకు విస్తృత చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన తన ఛాంబర్‌లో మలేరియా అధికారి నూకరాజు, డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్‌తో కలిసి అవగాహన బ్యానర్ ఆవిష్కరించారు. దోమలు మానవులలో అనేక వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు.అంతేకాదు చాలా మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడ దోమలు మానవ శరీరాల నుంచి రక్తాన్ని పీలుస్తాయన్నారు. ప్రజలందరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, ఎస్‌ఓ హేమసుందరం, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు భక్తి సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రముఖ గాయని బుర్రా హేమ మాలినిచే భక్తి సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త పేర్కొన్నారు. శనివారం గోకులంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులందరూ ఆధ్యాత్మిక సంగీత విభావరిలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తిరుమల తిరుపతి దేవ స్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి,వివిధ ధార్మికసంస్థల ప్రతినిధులు మేడా సుబ్రహ్మణ్యం, నాగఫణిశాస్త్రి, మోక్షేశ్వరుడుపాల్గొన్నారు.

### టిప్పర్ యజమానికి రూ.లక్ష జరిమానా

కర్నూలు (న్యూసిటీ) : ఎలాంటి అనుమతి లేకుండా గూడూరు మండలం బూడిదపాడు గ్రామం నుంచి మట్టి తరలిస్తూ పట్టుబడిన కర్నూలుకు చెందిన టిప్పర్ యజమాని ప్రసాద్‌రెడ్డికి లక్ష రూపాయలు జరిమాన విధించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఇలా ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తీసుకెళ్తే జరిమానతో పాటు కఠిన చర్యలు తప్పవని శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

### ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

కర్నూలు కల్చరల్: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, రోజువారీ లక్ష్యాలను ఖచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లు, ఎంఈఓలు తదితరులతో హౌసింగ్, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో తదితర అంశాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చివరి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఆగస్టు 25వ తేదీ నాటికి 100 శాతం పూర్తి చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబువి ఓటు బ్యాంకు రాజకీయాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యం యాదవ్

కర్నూలు(రాజ్‌విహార్): టీడీపీ అధినేత చంద్రబాబువి ఓటు బ్యాంకు రాజకీయాలని, రాష్ట్రంలోని యాదవులను అలాగే వాడుకున్న చరిత్ర ఆయనదని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్యం యాదవ్ అన్నారు. శనివారం స్థానిక బిర్లా గేట్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రోజురోజుకు ప్రజాధారణ పెరిగిపోతుందన్నారు. ఇది గమనిస్తున్న చంద్రబాబుకు ముందస్తు ఓటమి పట్టుకుందని, దీంతో ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేస్తున్న సీఎం జగన్ యాదవుల ఆత్మగౌరవమైన 'సన్నిధి గొల్ల' వంశపారపర్యం హక్కును కల్పించి ఘనత దక్కించుకున్నారని పేర్కొన్నారు. ఇటు అన్ని ఆలయాల్లో ట్రస్టు బోర్డు సభ్యులుగా తమకు ప్రాధాన్యత కల్పించారన్నారు. ఇలాంటి ఎన్నో మంచి పనులు వైఎస్ జగన్ చేయడంతో యాదవులంతా వైఎస్‌ఆర్‌సీపీ పక్షానే ఉన్నారని చెప్పారు. పార్టీలో ఉన్న రమేష్ యాదవ్ స్వప్రయోజనాల కోసమే పార్టీకి రాజీనామా చేశారని, దీనిపై ఆలోచించుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు కృష్ణమూర్తి యాదవ్, మాజీ జెడ్పీటీసీ కాశీవిశ్వనాథ్‌రెడ్డి యాదవ్, రాజశేఖర్, రవి పాల్గొన్నారు.



గార్గేయపురం సమీపంలో వజ్రాల వేటలో జనం

## వజ్రాన్వేషణ

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని గార్గేయపురం డంప్‌యార్డుకు వెళ్లే దారిలో వజ్రాల వేట కొనసాగుతోంది. వారం రోజుల క్రితం గార్గేయపురానికి చెందిన ఒకరికి రూ.30 లక్షల విలువ చేసే వజ్రం లభ్యమైందనే ప్రచారం జరిగింది. దీంతో చుట్టు ముట్టు గ్రామాల ప్రజలు పిల్లాపాపలతో టిఫిన్‌లు, క్యారియర్‌లు తెచ్చుకుని అక్కడే తింటూ వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. శనివారం ఉదయం కూడా ఇద్దరు వ్యక్తులకు వజ్రం దొరికినట్లు అన్వేషనకు వచ్చిన వారు చెప్పారు.



## ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష తప్పదు





కార్యక్రమానికి హాజరైన వైద్యులు, విద్యార్థులు, మాట్లాడుతున్న స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పటాన్ షియాజ్‌ఖాన్

- వైద్యవిద్యార్థులతో స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పటాన్ షియాజ్‌ఖాన్

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థులు తమ తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే జైలు శిక్ష తప్పదని, ఈ మేరకు కఠిన చట్టాలు ఉన్నాయని స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్(ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) పటాన్ షియాజ్ ఖాన్ చెప్పారు. శనివారం నగర శివారులోని పెంచికలపాడులో ఉన్న విశ్వభారతి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ పటాన్ షియాజ్ ఖాన్ మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధంపై విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. నేరం తీవ్రతను బట్టి శిక్ష పరిమాణం మారుతుందని చెప్పారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినా అందుకు ప్రోత్సహించినా వారికి శిక్ష విధిస్తారన్నారు. దీనివల్ల విద్యార్థులకు భవిష్యత్‌లో సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మునీరుద్దీన్ అహ్మద్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధరనాయక్, సోషల్ వర్కర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### విద్య, ఉద్యోగ అవకాశాలపై సదస్సు

కర్నూలు సిటీ: స్థానిక సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో విద్య, ఉద్యోగ అవకాశాలపై రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, అమెరికాలోని మాసాచుసెట్స్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డా.మహేంద్ర బి.దేవల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆహార, వైద్య, ఫార్మా రంగాల్లో రసాయన శాస్త్ర విభాగం కీలకమన్నారు. విదేశాల్లో విద్య అవకాశాలు, ఉపకార వేతనాల గురించి వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌యూలో నాన్ టీచింగ్ సిబ్బంది బదిలీలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆయా డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని బదిలీ చేసినట్లు వీసీ ఆనందరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో మొత్తం 57 మంది బోధనేతర సిబ్బంది స్థానాలు మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన సోమవారం నిర్వహించనునట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, డైరెక్టర్లు, మండల స్థాయి అధికారులు వారి శాఖల నివేదికలతో హాజరుకావాలని కోరారు.

## సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన అశోక్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఇది దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, షేక్, ఇర్ఫాన్, సాధిక్, జోషి, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజనతో ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ఈ మేరకు అలవాట్లు మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన చెప్పారు. స్థానిక ఎ.క్యాంపులో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కర్నూలు హెల్త్ క్లబ్‌లో శనివారం లిఫ్ట్ నిర్మాణానికి కలెక్టర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్త్‌క్లబ్‌లోని జిమ్, యోగా సెంటర్, ఇండోర్ గేమ్స్ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇందులోని ఏర్పాట్లు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రతి నెలా మొదటి ఆదివారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సేవలు విస్తృతం చేయాలని సూచించారు. 20 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఇక్కడ పేదలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ వసంతకుమార్, సభ్యులు కేసీ రాముడు, నాగేశ్వరబాబు, లక్ష్మన్న, వాసు, ప్రహ్లాదరావు, జగన్నాథ గుప్త, పోతన పాల్గొన్నారు.

### గుండెలో అరుదైన బద్దెపురుగు తిత్తులు

కర్నూలు(హాస్పిటల్): గుండెలో బద్దెపురుగు తిత్తులు ఏర్పడగా డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో గౌరిగోపాల్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేసి తొలగించారు. వివరాలను శనివారం స్థానిక గౌరిగోపాల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ పి.లక్ష్మణస్వామి వివరించారు. ''వైఎస్‌ఆర్ జిల్లా కమలాపురం మండలం చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్(55) కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇటీవల తరచూ గుండెలో నొప్పి, ఏదో పట్టేసినట్టు ఉంటోంది. స్థానిక వైద్యుల సూచన మేరకు గౌరిగోపాల్ ఆసుపత్రికి రాగా గుండెలో హైడాటిడ్ సిస్ట్ ఉన్నట్లు నిర్ధారించాం. వీటిని ఈ నెల ఒకటో తేదీన ఆపరేషన్ చేసి తొలగించాం. సాధారణంగా ఈ ఇన్‌ఫెక్షన్ సోకిన సంవత్సరాల కొద్దీ రోగి బాగానే ఉన్నా ఈ తిత్తుల పరిమాణం పెరిగే కొద్దీ రోగం వస్తుంది. ఇలాంటి తిత్తులు కాలేయం, కొన్నిసార్లు ఊపిరితిత్తులు, మెదడులో ఏర్పడతాయి. కానీ 2లక్షల మందిలో ఒకరికి మాత్రమే గుండెలో ఏర్పడతాయి. ఈ జబ్బు రాకుండా ఉండాలంటే కలుషిత మాంసం, ఆహారం, నీరు తీసుకోరాదు. బాగా ఉడికించిన ఆహారాన్ని తినాలి. కుక్కలు పెంచేవారు తప్పనిసరిగా వాటికి వ్యాక్సిన్‌లు ఇప్పించాలి. డీ వార్మింగ్ చేయించాలి.'' అని డాక్టర్ లక్ష్మణస్వామి వివరించారు.

## గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలందించాలి



ఆరోగ్య కార్యకర్తలకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): మహిళా ఆరోగ్య కార్యకర్తలు గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న మహిళా ఆరోగ్య కార్యకర్తల శిక్షణ ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలని చెప్పారు. గ్రామస్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు నోటి శుభ్రత, కంటి, చెవి, ముక్కు, గొంతు, అత్యవసర సేవల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వారికి ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్యకార్యకర్త, సీహెచ్‌ఓలు గర్భిణులను త్వరగా గుర్తించి నమోదు చేసి వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, చంద్రకాంత్‌యాదవ్, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ రజని, డాక్టర్ సుష్మిత పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### మూర్ఛ వ్యాధితో వ్యక్తి మృతి

కర్నూలు : కర్నూలు నగరం వడ్డెగేరికి చెందిన బోండాల నాగేంద్ర (50) మూర్ఛ వ్యాధితో మృతిచెందారు. ఈయన కూలీ పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎర్రబురుజులో ఇంటి నిర్మాణ పనుల్లో శుక్రవారం పనిచేస్తూ మూర్ఛ వ్యాధి సోకి సొమ్మసిల్లి పడిపోవడంతో తోటి కూలీలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక రాత్రి మృతిచెందాడు. ఈయనకు ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. పెద్దకుమారుడు మణికంఠ ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్ షాక్‌తో తెలంగాణ వాసి మృతి...

నగర శివారులోని జొహరాపురం రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న అశ్విని హాస్పిటల్‌లో ఎలక్ట్రికల్ అండ్ ల్యాండ్ నెట్‌వర్క్ పనిచేస్తూ విద్యుత్ షాక్‌కు గురై నల్గొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగూడెం తుకాపురం గ్రామానికి చెందిన కణిగంటి మహేష్ (28) మృతిచెందాడు. ఈ యువకుడు జీవనోపాధి నిమిత్తం స్నేహితులతో కలిసి కర్నూలుకు వలస వచ్చి కొంతకాలంగా అశ్విని హాస్పిటల్ నిర్మాణ పనుల్లో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం నాలుగో అంతస్తులో కరెంటు మిషన్ రిపేరీ చేస్తుండగా షాక్ తగిలి పైనుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. తోటి కూలీ అయిన భువనగిరి జిల్లా యాదగిరి మండలం మూటకొండూరు గ్రామానికి చెందిన మంతి శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.